

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి గురువారం 14-05-2026 సంపుటి: 02 సంచిక : 13 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Thursday 14-05-2026 Volume :02 Issue: 13 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777



# ఐబొమ్మ..రీ ఓపెన్!

- కొత్త మూవీలతో కళకళలాడుతున్న పైరసీ సైట్
- వెబ్‌సైట్ పునరుద్ధరణతో సినీ పెద్దల విస్మయం
- సాంకేతికతను వాడుకుంటూ డొమైన్లను మారుస్తున్న ముఠా
- నెట్‌వర్క్‌ను ఛేదించడం పోలీసులకు సవాల్

## పైరసీ భూతం మళ్లీ వచ్చేసింది

కొన్నాళ్లుగా సైలెంట్ గా ఉన్న ఐబొమ్మ మళ్లీ ప్రత్యక్షమైంది. బప్పం టీవీ, మూవీ రూల్జ్ జతకలవడంతో టాలీవుడ్ పెద్దలకు ముచ్చెమటలు పడుతున్నాయి. కోట్లు పెట్టి నిర్మించిన భారీ బడ్జెట్ చిత్రాలు ఇలా విడుదల కాగానే అలా హెచ్డీ క్వాలిటీలో ఈ సైట్లలో ప్రత్యక్షమవుతున్నాయి. ఇమ్మడి రవి బెయిల్ మీద బయటకు రాగానే మళ్లీ పైరసీ ప్రారంభంకావడం పోలీసులకు కొత్త సవాల్ గా మారింది.

2 లో






## సోనియాకు..
# అస్వస్థత
### గురుగ్రామ్ ఆస్పత్రిలో చేరిక

- కేరళ నుంచి రాహుల్ హుటాహుటిన ఢిల్లీకి పయనం
- టెస్ట్ అనంతరం సోనియా డిశ్చార్జ్
- ఆరోగ్యంపై ఆందోళన వద్దన్న రాహుల్

న్యూఢిల్లీ,

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ మరోసారి అనారోగ్యంతో బుధవారం గురుగ్రామ్ లోని మేదాంత ఆసుపత్రిలో చేరారు. మంగళవారం రాత్రి ఆమెను ఆసుపత్రికి తరలించగా, వైద్యులు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా కడుపు సంబంధిత సమస్యలు, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు ఏవైనా ఉన్నాయా అనే కోణంలో వైద్యులు పరీక్షలు జరిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని, పరీక్షలు అనంతరం తిరిగి ఇంటికి చేరుకున్నారని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ ధృవీకరించారు.

-మిగతా 2 లో

## కేంద్ర ప్రభుత్వమే
# పొదుపు చేయాలి

- రేవంత్‌పై కేటీఆర్ భాష చెత్తగా ఉంది
- టీడీపీ-బీజేపీ-జనసేన కలిసి వచ్చినా 30 శాతం దాటవు
- మంత్రి పదవికంటే పీసీసీ చీఫ్‌గా ఉండటమే గర్వంగా ఉంది
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్




హైదరాబాద్ మే13 : (నేటి దర్శిని)

రాష్ట్ర ప్రభుత్వం పొదుపు చర్యలపై కసరత్తు చేస్తోందని, ప్రజలు ఎప్పటినుంచో పొదుపు చేస్తున్నారని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వమే పొదుపు చేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గత 12 ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ పొదుపు గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. క్రూడ్ ఆయిల్ ధరలు సగానికి తగ్గినా పెట్రోల్ ధరలను మాత్రం పెంచారని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వాడుతున్న భాష చాలా చెత్తగా ఉందని మహేష్ గౌడ్ మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ను ముఖ్యమంత్రిగా తమ ప్రభుత్వం ఎప్పుడూ అగౌరవపరచలేదన్నారు. సంపన్నులు ఎప్పుడైనా బంగారం కొనుగోలు చేస్తారని, కానీ పేద ప్రజలు మాత్రం పెళ్లిళ్ల వంటి అవసరాల సమయంలోనే బంగారం కొనుగోలు చేస్తారని ఆయన పేర్కొన్నారు. కమ్యూనిస్టులు పూర్తిగా ముగిసిపోయారని భావించడం పొరపాటేనన్నారు. తెలంగాణ రాజకీయాల్లో

-మిగతా 2 లో

# ఉబర్ ఎక్సలెన్స్ సెంటర్ విస్తరణ

## సీఎంతో ఉబెర్ సీఈఓ దారా ఖోస్రోషాహి భేటీ

- ఫ్యూచర్ సిటీలో కార్పొరేట్ ఆఫీస్
- పార్కింగ్ సమస్యపై దృష్టిపెట్టండి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన

హైదరాబాద్ మే13 : (నేటి దర్శిని)

ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉబర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు. బుధవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ అయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలంగాణలో ఉబెర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను దారా

-మిగతా 2 లో







## హిందూయిజం
# ఒక జీవన విధానం

- విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి గుడికి వెళ్లడం తప్పనిసరేం కాదు
- ఇంట్లో ఒక దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుంది
- సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు


న్యూఢిల్లీ :

హిందూయిజం అనేది జీవన విధానమని, ఈ విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి గుడికి వెళ్లడం లేదా పూజలు చేయడం తప్పనిసరేం కాదని తొమ్మిది మంది న్యాయమూర్తుల సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. హిందూయిజంపై విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి ఇంట్లో ఒక దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుందని తేల్చి చెప్పింది. కేరళలోని శబరిమల ఆలయం సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లతో పాటు దావూదీ బోహ్రాలతో సహా పలు మతాలు పాటించే మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరిపే క్రమంలో బుధవారం

-మిగతా 2 లో

## రికార్డుస్థాయి కనిష్ఠానికి
# రూపాయి పతనం

- ఇంట్రాడేలో 95.80కి జారుకున్న విలువ
- ఆసియాలోనే మన కరెన్సీ వరస్ట్ పర్ఫార్మెన్స్



ముంబై, మే13 : (నేటి దర్శిని)

దేశీయ కరెన్సీ చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్నది. క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం, పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో రూపాయి విలువ పాతాళంలోకి జారుకున్నది. ఇంట్రాడేలో 95.80 కనిష్ఠ స్థాయికి జారుకున్న రూపాయి మారకం విలువ చివరకు ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 95.66 వద్ద ముగిసింది. ఫారెక్స్ మార్కెట్ చరిత్రలో రూపాయి ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. దిగుమతిదారులు


-మిగతా 2 లో

# బలపరీక్షలో నెగ్గిన విజయ్

- విజయ్ ప్రభుత్వానికి 144 మంది శాసనసభ్యుల మద్దతు
- విజయ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేసిన 22 మంది సభ్యులు
- బలపరీక్ష సమయంలో వాకౌట్ చేసిన డీఎంకే
- మద్దతు ఇచ్చిన కాంగ్రెస్, వీసీకే, సీపీఐ
- తటస్థంగా ఉన్న బీజేపీ

చెన్నై :మే13 : (నేటి దర్శిని)

తమిళనాడులో నూతనంగా కొలువుదీరిన విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం విశ్వాస పరీక్షలో గట్టెక్కింది. విజయ్‌కు అనుకూలంగా 144 ఓట్లు, వ్యతిరేకంగా 22 ఓట్లు వచ్చాయి. పీఎంకే, బీజేపీకి చెందిన మొత్తం ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా నిలిచారు. విజయ్ ప్రభుత్వం బలపరీక్షలో నెగ్గినట్టు స్పీకర్ జె.ఎన్.సి



-మిగతా 2 లో

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


- రాష్ట్రంలో 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు
- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టా
- సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ మే13 : (నేటి దర్శిని)

తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఉ పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తీవ్ర వడగాల్పులు, 44 డిగ్రీల సెల్సియస్ కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రి బుధవారం ఆదేశించారు.



-మిగతా 2 లో



# విరాట్ సూపర్ సెంచరీ

- కోహ్లీ నూరు.. కోల్‌కతా బేజారు
- ఎనిమిదో విజయంతో టాప్ ప్లేస్‌కు ఆర్‌సీబీ

రాయ్‌పూర్

డిఫెండింగ్ చాంపియన్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మరోసారి ‘టాప్’ లేపే ఆటతో దుమ్మురేపింది. బంతితో ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయినా ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లీ (60 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లతో 105 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగిన వేళ.. ఈ సీజన్‌లో ఆ జట్టు ఎనిమిదో విజయంతో పాయింట్ల పట్టికలో మళ్లీ అగ్రస్థానాన్ని దక్కించుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ఓడించిన ఆర్‌సీబీ.. ప్లేఆఫ్స్‌కు అడుగుదూరంలో నిలిచింది. కేకేఆర్ నిర్దేశించిన 193 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది.

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ కోహ్లీకి అండగా దేవదత్ పడిక్కల్ (27 బంతుల్లో 39, 7 ఫోర్లు) రాణించాడు. తొలుత అంగ్‌క్రిష్ రఘువంశీ (46 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 71 ), రింకూ సింగ్ (29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌తో 49 నాటౌట్)

-మిగతా 2 లో

# లుక్ అవుట్.. నోటీసులివ్వండి

## భగీరథ్ విదేశాలకు పారిపోకుండా జారీ చేయాలి

- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్
- బాలిక ఫోటోలు రిలీజ్ చేసింది బీఆర్ఎస్సే
- వెంటనే వారిని అరెస్ట్ చేయాలి
- బాధితురాలికి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటాం

హైదరాబాద్, మే13 : (నేటి దర్శిని)

కేంద్ర మంత్రి బండి సంజయ్ కొడుకు భగీరథ్ విదేశాలకు పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా అత్యుత్సాహంతో బాధితురాలి ఫోటోలు బయటకు వచ్చాయని ఆరోపించారు. ఫోటోలు బయట పెట్టిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. బండి సంజయ్ కుమారుడి మీద చాలా బలమైన ఆరోపణలు వచ్చాయని, అలాంటి సందర్భంలో ప్రధాని మోదీ,

-మిగతా 2 లో



# ఐబొమ్మ..రీ ఓపెన్ !

-కొత్త మూవీలతో కళకళలాడుతున్న పైరసీ సైట్
-వెబ్‌సైట్ పునరుద్ధరణతో సినీ పెద్దల విస్మయం
-సాంకేతికతను వాడుకుంటూ డొమైన్లను మారుస్తున్న ముఠా
-నెట్‌వర్క్‌ను ఛేదించడం పోలీసులకు సవాల్




హైదరాబాద్
టాలీవుడ్‌ను పైరసీ భూతం మళ్లీ వెన్నాడుతోంది. ఒకవైపు డిజిటల్ విప్లవం, మరోవైపు పైరసీ సైట్ల దాడితో కుదేలవుతున్న చిత్ర పరిశ్రమకు ఐబొమ్మ రూపంలో మరో భారీ షాక్ తగిలింది. ఈ సైట్ నిర్వాహకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రవి అరెస్ట్ కావడంతో ఇక ఐబొమ్మ అధ్యాయం ముగిసిందని అంతా భావించారు. కానీ, ఎవరూ ఊహించని విధంగా రవి బెయిల్‌పై విడుదలైన కొద్ది రోజులకే ఆన్‌లైన్‌లో మళ్లీ ఈ సైట్ ప్రత్యక్షమవ్వడం ఇప్పుడు ఇండస్ట్రీలో కలకలం రేపుతోంది. గతంలో ఐబొమ్మ రవిని పోలీసులు అరెస్ట్ చేసినప్పుడు పైరసీకి అడ్డుకట్ట పడుతుందని నిర్మాతలు ఊపిరి పీల్చుకున్నారు. అప్పట్లో సైట్ పూర్తిగా నిలిచిపోయింది. అయితే, తాజాగా వెబ్‌సైట్ పునరుద్ధరించబడటమే కాకుండా, థియేటర్లలో ఉన్న కొత్త సినిమాలు సైతం అందులో ప్రత్యక్షమవ్వడం పట్ల సినీ పెద్దలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రవి బెయిల్‌పై రావడం, వెంటనే సైట్ ఆపరేషన్లు మొదలవ్వడం వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను ఛేదించడం పోలీసులకు సవాలుగా మారింది. సాంకేతికతను వాడుకుంటూ డొమైన్లను మారుస్తూ వస్తున్న ఈ పైరసీ ముఠాను అరికట్టడంలో ఎక్కడ లోపం జరుగుతుందనే చర్చ మొదలైంది. ఇప్పుడు పోలీసులు మళ్లీ రవి కోసం వేట మొదలు పెట్టారు.

# సోనియాకు.. అస్వస్థత

మొదటి తరువాయి

**కేరళ పర్యటనను రద్దు చేసుకుని..**
సోనియా గాంధీ ఆసుపత్రిలో చేరారన్న వార్త తెలియగానే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన కేరళ పర్యటనను రద్దు చేసుకుని హుటాహుటిన ఢిల్లీకి చేరుకున్నారు. కోజికోడ్ లో జరగాల్సిన ర్యాలీలో వర్చువల్ గా పాల్గొంటూ.. "ఒక కొడుకుగా నా తల్లి ఆరోగ్యం పట్ల ఆందోళన చెంది ఇక్కడే ఉండాలని నిర్ణయించుకున్నాను. కేరళ ప్రజలు నా పరిస్థితిని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను" అని భావోద్వేగంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో తన తల్లిని ప్రతి గంటకూ పర్యవేక్షిస్తూ తనకు ధైర్యాన్నిచ్చిన ఓ కేరళ నర్సు గురించి రాహుల్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత కొన్నేళ్లుగా సోనియా గాంధీ తరచూ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది మార్చి 24న జ్వరం, ఇన్ఫెక్షన్ కారణంగా గంగారామ్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. అలాగే గతేడాది జూన్ 7న, అంతకుముందు కూడా జీర్ణకోశ సంబంధిత సమస్యలతో పలుమార్లు ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. తాజాగా మరోసారి వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వెళ్లడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే ప్రస్తుతం సోనియా గాంధీ క్షేమంగా తిరిగి రావడంతో పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి.

# హిందూయిజం ఒక జీవన విధానం

మొదటి తరువాయి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, జస్టిస్ ప్రసన్న బీ వరాలే, జస్టిస్ ఆర్ మహాదేవన్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ కూడా ఉన్నారు.
శబరిమల ఆలయ ప్రవేశ తీర్పు – పునఃసమీక్ష పిటిషన్లపై విచారణ
శబరిమల ఆలయ ప్రవేశ తీర్పును 2018 సెప్టెంబర్ 28న సుప్రీంకోర్టు ఇచ్చింది. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. 10 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని 4:1 మెజారిటీతో ఆనాడు సుప్రీంకోర్టు బెంచ్ తీర్పు ఇచ్చింది. 2018 నాటి ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పునఃసమీక్ష పిటిషన్లపై ప్రస్తుతం సుప్రీంకోర్టులో 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతోంది. దీనిపై తమ వాదనలను కూడా వినాలంటూ పలువురు మధ్యంతర పిటిషన్లు దాఖలు చేశారు. ఈ విచారణలో భాగంగా బుధవారం మధ్యంతర పిటిషన్ దాఖలు చేసిన ఒక పక్షం తరఫున అడ్వకేట్ డాక్టర్ జీ. మోహన్ గోపాల్ వాదనలు వినిపించారు.

**ఇప్పుడందరూ వేదాలను అంగీకరిస్తున్నారా?**
"హిందూ మతంలోని పలు వర్గాల నుంచే సామాజిక న్యాయం కోసం డిమాండ్ వస్తోంది. హిందూయిజాన్ని ఒక మత వర్గంగా నిర్వహించారు. మతం, తత్వశాస్త్రానికి సంబంధించిన అన్ని విషయాల్లో వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరించేవాడే హిందువు అని 1966లో తీర్పు ఇచ్చారు. హిందువులందరి అభిప్రాయాలను తీసుకోకుండానే గతంలో కోర్టులు ఈవిధంగా ఒక నిర్ణయానికి వచ్చాయి. హిందువుల్లో ఎవ్వరూ ఎప్పుడూ అలా చెప్పలేదు. నాకు వేదాల పట్ల అత్యంత గౌరవం, గొప్ప ఆరాధనా భావం ఉన్నాయి. కానీ, నేడు హిందువులుగా పరిగణించే ప్రతి ఒక్కరూ అన్ని ఆధ్యాత్మిక, తాత్విక విషయాల్లో వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరిస్తున్నారన్నది వాస్తవమేనా?" అని మధ్యంతర పిటిషన్ దాఖలు చేసిన ఒక పక్షం తరఫున అడ్వకేట్ డాక్టర్ జీ. మోహన్ గోపాల్ సుప్రీంకోర్టులో వాదన వినిపించారు.

**అందుకే హిందూ మతాన్ని జీవన విధానం అంటారు**
ఈ వాదనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న స్పందిస్తూ, "అందుకే హిందూ మతాన్ని ఒక జీవన విధానం అంటారు. ఒక హిందువు హిందువుగా ఉండటానికి తప్పనిసరిగా గుడికి వెళ్లడం గానీ, ఏదైనా ఆచారం పాటించడం గానీ అవసరం లేదు" అని ఆమె పేర్కొన్నారు. "ఆచారబద్ధంగా ఉండాల్సిన అవసరం లేదు. ప్రజలు తమ విశ్వాసాన్ని కలిగి ఉండటానికి ఎవరూ అడ్డు రాలేరు" అని జస్టిస్ నాగరత్న తెలిపారు. "ఒక వ్యక్తి హిందూ మత విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి, గుడిసెలో దీపాన్ని వెలిగించుకున్నా సరిపోతుంది" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ సందర్భంగా కీలక వ్యాఖ్య చేశారు.

# కేంద్ర ప్రభుత్వమే పొదుపు చేయాలి

మొదటి తరువాయి

ఇంకా వారికి ప్రాధాన్యం ఉందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీ కలిసి పోటీ చేసినా కాంగ్రెస్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. మూడు పార్టీలు కలిసి వచ్చినా తెలంగాణలో 30 శాతం ఓట్లను దాటలేవని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పదవి కంటే పీసీసీ చీఫ్‌గా పనిచేయడంలోనే తాను ఎక్కువ సంతోషం, గర్వం పొందుతున్నానని మహేష్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# ఉబర్ ఎక్సలెన్స్ సెంటర్ విస్తరణ

మొదటి తరువాయి

ఖోస్రోషాహి వివరించారు. హైదరాబాద్‌లో ఉబెర్ ఎక్సెలెన్స్ సెంటర్ ను విస్తరిస్తున్నట్టు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేననీ, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్టు ప్రకటించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తిగా ఉన్నామని దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు సీఎం సూచించారు. మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదని తెలిపారు. దీని వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ చార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సీఎం సూచించారు. ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది.
హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామనీ, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (సీబీవో) మధు కన్నన్, ఉబెర్ ఇండియా సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# బలపరీక్షలో నెగ్గిన విజయ్

మొదటి తరువాయి

ప్రభాకర్ ప్రకటించారు.
మే 13వ తేదీలోగా మెజారిటీ నిరూపించుకోవాలని గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ ఆదేశించిన నేపథ్యంలో బుధవారం 'ఫ్లోర్ టెస్ట్' నిర్వహించారు. విశ్వాస పరీక్షపై తీర్మానాన్ని సీఎం విజయ్ ప్రవేశపెట్టారు. తమిళనాడు అసెంబ్లీ చర్చ సందర్భంగా తొలుత మాట్లాడిన కాంగ్రెస్ సభ్యులు తాము విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. విజయ్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకున్న తొలి మూడు నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత వామపక్షాలు విజయ్‌కు మద్దతు ప్రకటించాయి. సీఎం విజయ్ ప్రమాణస్వీకారానికి ముందు గవర్నర్ అర్లేకర్ పలుమార్లు తిరస్కరించిన తీరుపై సీఎం అభ్యంతరం వ్యక్తం చేసింది. తమిళనాడులో గవర్నర్ రూల్ను అడ్డుకోవాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం తమిళనాడు హక్కులను కాలరాస్తోందని సీపీఐ ఆరోపించింది. విజయ్ ఐదేళ్లపాటు కొనసాగాలని వీసీకే ఆశాభావం వ్యక్తం చేసింది. అయితే ఓఎస్డీగా వ్యక్తిగత జ్యోతిష్యుడిని విజయ్ నియమించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. విజ్ఞానశాస్త్రానికి సీఎం అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఏఐఏంఏంకే బహిష్కృత ఎమ్మెల్యే



కామరాజు సైతం విజయ్‌కు మద్దతు ఇచ్చారు. ఒక్క ఎమ్మెల్యే ఉన్న డీఎండీకే సైతం విజయ్‌కు మద్దతు తెలిపింది.

**డీఎంకే వాకౌట్ :**
డీఎంకేతో పాటు అన్నాడీఎంకే పళనిస్వామి వర్గం వ్యతిరేకించాయి. బలపరీక్షకు ముందుగానే విజయ్, తమిళనాడు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. 65 శాతం తమిళనాడు ఓటర్లు విజయ్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారని పేర్కొన్నారు. తమ కూటమి పక్షాలతోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తారని విజయ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమిళనాడులో రీల్ ప్రభుత్వం కాకుండా రియల్ ప్రభుత్వం ఉండాలని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఓటింగ్‌కు దూరంగా ఉంటామని చెబుతూ 59 ఎమ్మెల్యేలు ఉన్న డీఎంకే వాకౌట్ చేసింది.

**తటస్థంగా బీజేపీ :**
అయితే బీజేపీ మాత్రం ఈ ఓటింగ్‌లో 'తటస్థంగా' ఉండాలని నిర్ణయించింది. అన్బుమణి రామదాస్ నేతృత్వంలోని పీఎంకే ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్లు వెల్లడించింది. మరోవైపు అన్నాడీఎంకే పళనిస్వామి వర్గం విజయ్‌కు ఓటు వ్యతిరేకంగా ఓటు వేస్తామని ముందే చెప్పింది. విజయ్ ప్రభుత్వం తమ పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలకు డబ్బు ఆశ చూపి ఆకర్షించే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. మరోవైపు అన్నాడీఎంకే షణ్ముగం వర్గం పళనిస్వామి వ్యాఖ్యలను ఖండించింది. 25 మంది షణ్ముగం వర్గం ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మొదటి తరువాయి

ఒకవైపు భగ్గుమంటున్న ఎండలు, మరోవైపు ఈదురు గాలులు, ఉరుములు–మెరుపులతో కూడిన అకాల వర్షాలు సంభవించే పరిస్థితులు ఉన్నందున ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, తదుపరి రోజుల్లో జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో కూడా ఎండల తీవ్రత పెరిగే అవకాశముందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని, ఎండలో పనిచేసే వారు తలకు రక్షణ కల్పించే వస్త్రాలు ధరించాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. వడదెబ్బలు, ఎండ తీవ్రత కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, అంబులెన్సులు, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ వడదెబ్బ నివారణ చర్యలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. రైతులు, కూలీలు, నిర్మాణ కార్మికులు, రహదారులపై పనిచేసే కార్మికులు ఎండ తీవ్రత సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఈదురు గాలులు, ఉరుములు–మెరుపులు సంభవించే ప్రాంతాల్లో ప్రజలు చెట్ల కింద నిలబడకుండా, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# విరాట్ సూపర్ సెంచరీ

మొదటి తరువాయి



రాణించడంతో కోల్‌కతా నిర్ణీత ఓవర్లలో 192/4 స్కోరు చేసింది. వరుసగా నాలుగు విజయాల తర్వాత కేకేఆర్‌కు ఇది తొలి ఓటమి కాగా ఓవరాల్‌గా ఆరో పరాభవంతో ప్లేఆఫ్స్ అవకాశాలను దాదాపుగా వదులుకుంది.
కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్
ఛేదనలో బెథెల్ (15) మరోసారి తేలిగ్గానే వికెట్ సమర్పించుకున్నా గత రెండు మ్యాచ్‌ల్లో డకౌట్ అయిన కోహ్లీ.. ఈసారి రెచ్చిపోయి ఆడాడు. వైభవ్ తొలి ఓవర్లోనే నాలుగు బౌండరీలు బాదిన రన్ మెషీన్.. పడిక్కల్ అండగా చెలరేగి ఆడాడు. 21 పరుగుల వద్ద అతడు ఇచ్చిన క్యాచ్‌ను కవర్స్ వద్ద పావెల్ జారవిడవడంతో ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న కోహ్లీ.. ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. వరుస బౌండరీలతో పరుగుల వేటకు దిగిన పడిక్కల్ సైతం బ్యాట్ ఝుళిపిస్తూ బౌండరీలతో రెచ్చిపోగా పది ఓవర్లలో బెంగళూరు 101/1తో సాఫీగా లక్ష్యం వైపుగా సాగింది.
అదే జోరుతో కోహ్లీ.. 32 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తిచేశాడు. అయితే రెండో స్పెల్‌లో బంతినందుకున్న కార్తీక్.. పడిక్కల్‌ను ఆఫ్ కట్టర్‌తో బోల్తా కొట్టించి 59 బంతుల్లోనే 92రన్స్ జోడించిన మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. రజత్ పాటీదార్ (11), టిమ్ డేవిడ్ (2) నిరాశపరిచినా కోహ్లీ మాత్రం రెచ్చిపోయి ఆడాడు. అనుకుల్ ఓవర్లో 4, 6తో 90ల్లోకి వచ్చిన అతడు.. అరోరా 19వో ఓవర్లో సింగిల్‌తో మెగా లీగ్‌లోరెండేళ్ల తర్వాత మరో సెంచరీని నమోదుచేశాడు. జితేశ్ (8 నాటౌట్)తో కలిసి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

# రికార్డుస్థాయి కనిష్ఠానికి రూపాయి పతనం

మొదటి తరువాయి

డాలర్‌ను ఎగబడి కొనుగోళ్లు జరపడం రూపాయి పతనానికి ఆజ్యంపోశాయని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. కరెన్సీ పతనాన్ని అడ్డుకట్ట వేయడానికి రిజర్వు బ్యాంక్ రంగంలోకి దిగడంతో చివర్లో కోలుకున్నది. 95.52 వద్ద ప్రారంభమైన డాలర్, రూపాయి ఎక్స్చేంజ్ రేటు ఇంట్రాడేలో 95.80 కనిష్ఠ స్థాయిని తాకింది.వరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే 2 పైసలు పెరిగి 95.66 వద్ద ముగిసింది. మంగళవారం కరెన్సీ విలువ 40 పైసలు కోల్పోయి చారిత్రక కనిష్ఠ స్థాయి 95.68కి పడిపోయిన విషయం తెలిసిందే. ఆసియాలోనే అత్యంత వరస్ట్ పర్ఫార్మెన్స్ మన కరెన్సీదే కావడం గమనార్హం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కరెన్సీ విలువ 6 శాతం పతనం చెందింది. ఆర్బీఐ జోక్యంతోపాటు దిగుమతుల భారాన్ని తగ్గించుకోవడానికి నరేంద్ర మోదీ సర్కార్ పసిడి, వెండి దిగుమతులపై సుంకాన్ని 16 శాతానికి పెంచడం రూపాయి పతనానికి పరోక్షంగా దోహదం చేసింది. సమీక్ష భవిష్యత్తులో రూపీ విలువ 95.45 నుంచి 96.15 మధ్యలో పడిపోవచ్చునని ఫారెక్స్ డీలర్ అంచనావేస్తున్నారు.

# లుక్ అవుట్.. నోటీసులివ్వండి

మొదటి తరువాయి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్న వేదికను ఆయన పంచుకోవడం శోచనీయమన్నారు. కుటుంబ సభ్యులపై ఆ స్థాయి ఆరోపణలు వచ్చినప్పుడు ఆయన ఆ సమావేశానికి వెళ్లాల్సింది కాదన్నారు. దీనివల్ల పెద్దవాళ్ల పిల్లలు ఏ తప్పు చేసినా చూడనట్లు వ్యవహరిస్తారనే భావన ప్రజల్లోకి వెళ్లిందన్నారు.

**దేశం దాటించడం బీజేపీ నైజం**
ఏ ఆరోపణలు వచ్చినా సరే తొలుత నిందితులను దేశం దాటించడం బీజేపీకి అలవాటుగా మారిందన్నారు. అందుకే బండి సంజయ్ కుమారుడు దేశం దాటి వెళ్లకుండా లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని మరోసారి చెప్పారు. అప్పుడు మాత్రమే విచారణ పారదర్శకంగా జరుగుతుందని విశ్వాసం ప్రజలకు వస్తుందన్నారు.

**బీఆర్ఎస్ వల్లే ఫోటోలు బయటకు..**
కొన్ని పార్టీల వాళ్లు ఒక ట్వీట్ వేసి సమస్యను పరిష్కరించినట్లు చెబుతున్నారని అన్నారు. తాను ఎందుకు స్పందించడం లేదంటూ నానా హంగామా చేస్తున్నారని, ఒక ఆడపిల్ల అంశం వచ్చినప్పుడు చాలా సంయమనంగా వ్యవహరించాలన్నారు. అందులోనూ అమ్మాయి మైనర్ అయినప్పుడు ఇంకా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ సమాజం మగపిల్లలను క్షమిస్తుందని, కానీ ఆడపిల్లలను క్షమించదన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా అత్యుత్సాహం కారణంగా బాధితురాలి ఫోటోలు బయటకు వచ్చాయన్నారు. దీని కారణంగా ఆ అమ్మాయి జీవితం నష్టపోయే ప్రమాదం ఉందని, పోస్ట్ చేసిన ఖాతాలను గుర్తించి వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాము ఎప్పుడూ ఆడపిల్లలకు అండగా ఉంటామన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమిష్టి కృషి అవసరం: ఎంపీ డాక్టర్. కడియం కావ్య

- ప్రతి మూడు నెలలకు పాఠశాల అభివృద్ధిపై సమీక్ష సమావేశాలు నిర్వహించాలి
- మౌలిక వసతులు, శానిటేషన్ సమస్యల పరిష్కారానికి సర్పంచులు ముందుకు రావాలి
- బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి
- మహిళ అభివృద్ధిపైనే దేశ భవిష్యత్తు ఆధారితం
- పాఠశాల సమస్యలను నా దృష్టికి తీసుకురండి.. కేంద్ర నిధుల కోసం కృషి చేస్తా
- 99 రోజుల ప్రగతి ప్రణాళికలో విద్యకు ప్రత్యేక వారం కేటాయించడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం
- 2026 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు




**ఉమ్మడి వరంగల్, మే 13 (నేటి దర్శిని బ్యూరో)**
ప్రభుత్వ విద్యాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న చిత్తశుద్ధికి నిదర్శనమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండ కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సర్పంచుల అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను అన్ని తరాల భవిష్యత్తును తీర్చిదిద్దే కేంద్రాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, తాగునీరు, శానిటేషన్, మరుగుదొడ్లు, పరిశుభ్రత వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించి సమస్యల పరిష్కారానికి సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. బాలికల విద్యపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. మహిళ అభివృద్ధిపైనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు చదువు మానేయకుండా తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 590కు పైగా మార్కులు సాధిస్తూ ప్రతిభ చాటుతున్నారని తెలిపారు. సరైన అవకాశాలు, నాణ్యమైన బోధన అందితే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏ రంగంలోనైనా రాణించగలరని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో స్కిల్ డెవలప్మెంట్, కంప్యూటర్ ఎడ్యుకేషన్కు ప్రాధాన్యత పెరుగుతోందని పేర్కొన్నారు. విద్యార్థులను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను విద్యాశాఖ అధికారులు తన దృష్టికి తీసుకువస్తే కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ప్రత్యేక నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సర్వ శిక్ష అభియాన్ వంటి పథకాల ద్వారా మరిన్ని నిధులు సాధించేందుకు ప్రయత్నిస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యకు ప్రత్యేకంగా వారం రోజుల సమయం కేటాయించడం విద్యారంగంపై ప్రభుత్వ నిబద్ధతను చాటుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పాఠశాలలను ఎడ్యుకేషన్ హబ్లుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. 2026 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ఫాస్ట్ పథకాన్ని అమలు చేస్తుందని దీని ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, హాజరు శాతం మెరుగుపడుతాయని తెలిపారు. సమాజం ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తోడ్పడితేనే అవి మరింత బలోపేతం అవుతాయని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు అందరూ కలిసికట్టుగా పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత శక్తివంతంగా మారుతాయని, విద్యారంగంలో తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, సర్పంచులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ పట్టివేత



**మిడ్జిల్, మే 13, (నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామ శివారులో బుధవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను మిడ్జిల్ పోలీసులు పట్టుకున్నారు బ్లూ గోల్డ్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది తనిఖీలు చేపట్టగా TS 31 TA 0180 నెంబర్ గల ట్రాక్టర్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మల్లేష్ తండ్రి లింబియా ఆర్ సి తాండ గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు వెల్లడించారు. ట్రాక్టర్ ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపారు....

# మండల కేంద్రంలో అంబేద్కర్ ధ్యాప గోపాల్ రెడ్డి విగ్రహ స్థల పరిశీలన



**మిడ్జిల్, మే 13, (నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మాజీ జెడ్పీ చైర్మన్ ధ్యాప గోపాల్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణకు స్థలం పరిశీలన కార్యక్రమానికి ఆర్డిఓ నవీన్, తహసిల్దార్ రాఘవేందర్ రెడ్డి, అంబేద్కర్ సంఘ అధ్యక్షులు దేవయ్య ఆధ్వర్యంలో హాజరయ్యారు. మిడ్జిల్ సబ్ స్టేషన్ వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తే అనుకూలంగా ఉంటుందని విగ్రహ కమిటీ అధ్యక్షులు గ్రామ సర్పంచ్ మండల స్థాయి నాయకులు గ్రామ పెద్దలు మరియు అంబేద్కర్ సంఘం సభ్యులు అధికారులతో చర్చించారు అధికారులు స్థలాన్ని పరిశీలించి సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా అభివృద్ధికి గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అత్యంత కీలకం: ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు

- ప్రభుత్వ పాఠశాలలను ప్రజల విశ్వాస కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి పనిచేయాలి
- సర్పంచులు, కౌన్సిలర్లు విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పిలుపు
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు , కలెక్టర్



**ఉమ్మడి వరంగల్, మే13(నేటి దర్శిని బ్యూరో):**
విద్య అనేది సమాజాభివృద్ధికి పునాది అని ,ప్రతి గ్రామంలో విద్యా వికాసం జరిగితేనే సమగ్ర గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ,ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు ,స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం చాలా అవసరమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ తెలిపారు.వరంగల్ జిల్లా విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక విద్యా వారోత్సవాల సందర్భంగా సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులకు పాఠశాల విద్యా కార్యక్రమాలపై అవగాహన కల్పించే వర్క్‌షాప్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కెఆర్ నాగరాజ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుంటోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్ప ఆలోచనతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకీకరించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు అనేక సంస్కరణలు చేపడుతోందన్నారు. పాఠశాలల అభివృద్ధి కేవలం ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదని, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, స్థానిక సంస్థలు కలిసి పని చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు.ప్రతి గ్రామంలో పాఠశాలల పరిస్థితిని సర్పంచులు తరచూ పరిశీలించాలని, విద్యార్థుల హాజరు, పరిశుభ్రత, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన నాణ్యత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు గ్రామస్థాయిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక విద్యా వారోత్సవాలు విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తిని పెంచడమే కాకుండా పాఠశాలల పట్ల సమాజ బాధ్యతను కూడా పెంచుతున్నాయని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రజల విశ్వాస కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామస్థాయి అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తోందని, ప్రతి శాఖ ప్రజలకు చేరువయ్యేలా ప్రత్యేక కార్యాచరణలు చేపడుతోందన్నారు. విద్యా రంగంలో తీసుకొస్తున్న మార్పులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ నేతావాత్ శిభారాణి–రాజేందర్, వర్ధన్నపేట ఫ్యాక్స్ చైర్మన్ రాజేష్ ఖన్నా, మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య,కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, నునావత్ కమ్లి–కీమా నాయక్, మలోత్ దేవేందర్, తిరుపెల్లి వాణి– కుమారస్వామి, సర్పంచులు, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, ఆర్డిఓ సుమ, ఎంపీడీవో, ఎంఈఓ ప్రజాప్రతినిధులు, టౌన్ పార్టీ అధ్యక్షుడు మైస సురేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సొంతింటి కల సాకారం...

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి..



**కడ్తాల్, మే13(నేటి దర్శిని);**
కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సొంతింటి కల సాధ్యమని, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని బుధవారం నార్లకుంట తండా గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. అనంతరం మక్తమాదారం గేటు వద్ద వైజీఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో ఎంఈఓ ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ పాఠశాలల బలోపేతం పై ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలను బలోపేతం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉండడం చాలా సంతోషకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులందరికీ మంచి సౌకర్యాలను అందించడానికి సీఎం రేవంత్ రెడ్డి చొరవ చూపిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో ఎల్కేజీ నుండి ప్రారంభించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీతా నరసింహ,ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్,మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తల్లోజు గీత చారి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు తెలుగమల్ల జగన్, మండల విద్యాధికారి సర్దార్ నాయక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న దేప సురేఖ-భాస్కర్ రెడ్డి దంపతులు

**మహేశ్వరం, మే 13 (నేటి దర్శిని):**
నలభై రోజుల అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకున్న దేప సురేఖ, భాస్కర్ రెడ్డి దంపతులు బుధవారం ఉదయం శంషాబాద్ విమానాశ్రయం ద్వారా హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్నేహితులు ఘన స్వాగతం పలికి భారీ ర్యాలీ నిర్వహించారు. అమెరికాలోని వివిధ నగరాల్లో పర్యటించిన సందర్భంగా అక్కడ నివసిస్తున్న తెలుగు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులతో సమావేశమైనట్లు భాస్కర్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రజాపాలనపై ప్రవాస భారతీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో కొనసాగిన ఫామ్‌హౌస్ సంస్కృతి, గడిల పాలనకు ముగింపు పలికి,



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పారదర్శక పాలన కొనసాగుతుండటం పట్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రవాస భారతీయులను ఆకర్షిస్తున్నాయని వివరించారు.
తెలంగాణలో నెలకొన్న సానుకూల వాతావరణం కారణంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి అనేక మంది ఎన్‌ఆర్‌ఐలు ఆసక్తి చూపుతున్నారని భాస్కర్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు సామెడి గోపాల్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి, రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూన్న గణేష్, నేత గట్ల రవీంద్ర, ధనరాజు గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, తలాటి రమేష్ నేత, బొడ్డుపల్లి మహేందర్, బొక్క భూపాల్ రెడ్డి, యాదవ రెడ్డి, జ్ఞానేశ్వర్ యాదవ్, దంతోజు నరసింహ చారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


# పదవి బాధ్యతలను స్వీకరించిన సూదిని రామ్ రెడ్డి...



**ఆమనగల్లు,మే13(నేటి దర్శిని):**
ఇటీవల రాష్ట్ర గ్రామపంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్ గా ఎన్నికైనందున బుధవారం హైదరాబాదులోని పంచాయతీ రాజ్ ప్రధాన కార్యాలయంలో సూదిని రామ్ రెడ్డి పదవీ బాధ్యతలను చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయితీరాజ్ సంస్థలకు సంబంధించిన వివాదాలను, న్యాయపరమైన బాధ్యతలను నిర్వహిస్తామన్నారు. ఎన్నికల వివాదాలను,సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డ్ సభ్యుల ఎన్నికలకు సంబంధించిన వివాదాలు విచారించి, వాటిపై అనర్హత వేటు విషయంలో న్యాయబద్ధంగా వివాదాలను పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, సూదిని పద్మా రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


# సంపాదకీయం

## నీట'ముంచారు




విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే అత్యంత కీలకమైన ప్రవేశ పరీక్షల్లో ఒకటైన నీట్(ఎన్ఈఈటి) పరీక్ష?పత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. "ఒకే పరీక్ష-ఒకే దేశం-ఒకే మెరిట్" అంటూ కేంద్ర ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసిన విధానం చివరకు ఇరవై రెండు లక్షల మంది భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టింది. ఈ కుంభకోణంలో అత్యంత ఆందోళనకర అంశం పేపర్ లీక్ కంటే, దానిపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి. కేంద్రీకృత విధానాన్ని బలవంతంగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేసిన సర్కార్, భద్రతా ప్రమాణాలు, పారదర్శకత, పరీక్షా నిర్వహణలో కనీస బాధ్యతను కూడా నిలబెట్టుకోలేక పోయింది. లీకేజీలపై ముందస్తు హెచ్చరికలు వచ్చినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం అత్యంత బాధ్యతారాహిత్యం. ఘటన తర్వాత కూడా స్పష్టమైన సమాధానాలివ్వక పోవడం, దీన్నిసాధారణ వైఫల్యం లా చూపించడం, సమస్య తీవ్రతను తగ్గించి చూపే ప్రయత్నం చేయడం శోచనీయం. ఈ వ్యవహారంపై కేంద్ర విద్యామంత్రులు గానీ, ప్రధానిగానీ ఇప్పటివరకు స్పందించలేదు. వైద్య విద్యలో ప్రవేశం కోసం మే 3న జరిగిన నీట్ పరీక్ష? వెనక విద్యార్థుల సంవత్సరాల శ్రమ దాగుంది. ఎన్నో నిద్రలేని రాత్రులు, వారి మీద తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు, కుటుంబాల త్యాగాలు ఉన్నాయి. కానీ, ఈ శ్రమంతా ఒక్కరోజులోనే బూడిదలో పోసిన పన్నీరు అయింది. ప్రశ్నపత్రాల లీకేజీ, అక్రమాల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) మాత్రం ప్రవేశ పరీక్ష?ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. పరీక్ష? వ్యవస్థ పేపర్‌లీక్‌ల మాఫియాల చేతిలో బందీ అయితే ప్రభుత్వం ఏం చేస్తున్నదనేదే ఇక్కడ ప్రశ్న. అసలు అధికార యంత్రాంగం పర్యవేక్ష?ణ ఉందా? ఇదే కాదు, గత కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లు సాధారణ వార్తలుగా మారిపోయాయి. నీట్-యూజీ 2024లో బీహార్‌లో జరిగిన లీక్ కేసులో విద్యార్థులు, మధ్యవర్తులు, కోచింగ్ మాఫియాలు, అధికార యంత్రాంగంతో సంబంధాలున్న వ్యక్తులు అరెస్టయ్యారు. సీబీఐ దర్యాప్తులో అంతర్రాష్ట్ర ముఠాలు పనిచేసినట్లు బయటపడింది. తాజాగా రాజస్థాన్ ఘటనలో బీజేపీకి సంబంధికుడిని నిందితుడిగా అరెస్టు చేశారు. ఇక్కడ మరో ముఖ్యమైన అంశం. బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచే ఇలాంటి లీక్ వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. బీహార్, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో పరీక్షా మాఫియాలు రాజకీయ ఆశ్రయం లేకుండా ఇంత పెద్ద స్థాయిలో పనిచేయలేవు! పలు దర్యాప్తుల్లో అధికార వర్గాలకు దగ్గరగా ఉన్న వ్యక్తుల పేర్లు వినిపించడం యాదృచ్ఛికమేమీ కాదు. ఈ ప్రశ్నలకు కేంద్రం సమాధానం చెప్పకుండా తప్పించుకోవడం సమంజసం కాదు. ఇందులో మరో విఫలపాత్ర ఎన్‌టిఎది. పరీక్ష? నిర్వహణ దీనికి అప్పగించినప్పటి నుంచే పారదర్శకత, విశ్వసనీయతపై అనేక ఆరోపణలు ఎదుర్కొంటోంది. సాంకేతిక లోపాలు, ప్రశ్నాపత్రాల లీక్‌లు, మార్కుల గందరగోళం, గ్రేసు మార్కుల వివాదాలు పునరావృత మయ్యాయి. ప్రధానంగా యూజీసి-నెట్ 2024 పరీక్ష? సమగ్రత దెబ్బతిన్నదనే పేరుతో రద్దు చేయడం ఎన్‌టిఎ వైఫల్యానికి అతిపెద్ద ఉదాహరణ. నీట్‌లో పేపర్ లీక్ ఆరోపణలు, అసాధారణంగా టాపర్లు పెరగడం, ఒకే కేంద్రం నుంచి పలువురికి పూర్తి మార్కులు రావడం దేశవ్యాప్తంగా అనుమా నాలకు దారితీసింది. అందుకే ఎన్‌టిఎను రద్దుచేసి, పరీక్ష?ల నిర్వహణను వికేంద్రీకరించాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారంలో ప్రధానంగా నష్టపోయింది సాధారణ, మధ్య తరగతి, గ్రామీణ విద్యార్థులే. కోచింగ్ మాఫియాలు, డబ్బు ఆధారిత అవినీతి నెట్‌వర్కులు పరీక్షా వ్యవస్థను ఆక్రమిస్తున్నప్పటికీ వాటిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. పైగా పరీక్షా పత్రం లీక్ వంటి ఘటనలు పునరావృత మవుతున్నా పట్టించుకోవడం లేదు. బాధ్యులపై వేగవంతమైన చర్యలు లేకపోవడం పట్ల అధికార యంత్రాంగంపై అనుమానాలు పెంచుతోంది. ఈ ప్రవేశ పరీక్ష?కు ఏడాది కాదు... రెండేళ్ళు, జీవితాన్ని పణంగా పెట్టి సిద్ధమయ్యే విద్యార్థులున్నారు. అలాంటి సమయంలో కొందరు డబ్బుతో ప్రశ్నాపత్రాలు కొనుగోలు చేసి ముందే పరీక్ష రాస్తే, నిజాయితీగా చదివిన విద్యార్థి మనసులో ఎంత విరక్తి పుడుతుంది? "కష్టపడి చదివితే ఫలితం వస్తుంది" అనే నమ్మకాన్నే ఈ వ్యవస్థ చంపేస్తోంది. ఇప్పుడు కూడా పెద్దఎత్తున డబ్బులు చేతులు మారినట్టు తెలుస్తోంది. రాజస్థాన్‌లో పరీక్ష? నిర్వహణకు ఒకరోజు ముందే రూ.5లక్ష?లు, గంటకు ముందు రూ.30వేలకు ప్రశ్నపత్రాల్ని మాఫియా అమ్మకాలు చేసినట్టు విద్యార్థుల తల్లిదండ్రులే బహిరంగంగా ఆరోపిస్తున్నారు. "మెరిట్" పేరుతో విద్యను కేంద్రీకరించిన పాలకులు, అదే మెరిట్‌ను ఇప్పుడు మార్కెట్ శక్తులకు, అవినీతి ముఠాలకు అప్పగించిన పరిస్థితి కనిపిస్తోంది. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ఈ నిర్లక్ష్య ధోరణిని ప్రజాస్వామ్య సమాజం తీవ్రంగా ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. పరీక్షా వ్యవస్థపై విశ్వాసం పునరుద్ధరిం చాలంటే, కేంద్ర ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా పారదర్శక విచారణ, బాధ్యులపై కఠిన చర్యలు, భద్రతా వ్యవస్థలో సమూల మార్పులు చేపట్టాలి. దీనికోసం కేంద్రంపై విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవాలి.

## గత 12 ఏళ్లలో వృద్ధాప్య పింఛన్లు
# ఒక్క పైసా పెంచలేదు : ఖర్గే



**న్యూఢిల్లీ మే13 : (నేటి దర్శిని)** : సొంత ప్రచారం కోసం భారీగా ఖర్చు పెడుతూ.. పౌరులకు పొదుపు గురించి ఉపదేశిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బుధవారం తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నా.. గత 12 ఏళ్లుగా వృద్ధాప్య పింఛన్లను మోడీ ప్రభుత్వం పెంచలేదని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, భారతదేశంలోని వృద్ధులు, వితంతులు, వికలాంగులకు ఇచ్చే పింఛన్లను పెంచకుండా మోడీ ప్రభుత్వం వారి గౌరవాన్ని దెబ్బతీస్తోంది. నరేంద్ర మోడీజీ.. మీరు భారతదేశంలోని వృద్ధులు, వితంతువులు, వికలాంగుల గౌరవాన్ని లాక్కుంటూ, దేశానికి పొదుపు, త్యాగం గురించి ఉపన్యాసాలు ఇస్తారు. ధరల పెరుగుదలతో మన దేశ ప్రజలు అతలాకుతలమవుతుంటే.. గత 12 ఏళ్లుగా వృద్ధాప్య పింఛన్లను ఒక్క పైసా కూడా పెంచకుండా బిజెపి ఎందుకు నిరాకరిస్తోంది? అని ఖర్గే ప్రశ్నించారు.ప్రస్తుతం కొనుగోలు శక్తి 45 శాతం క్షీణించింది. దీంతో రూ. 200 పింఛను విలువ సుమారు రూ. 110, రూ. 300 పింఛను విలువ సుమారు రూ. 165, రూ. 500 పింఛను విలువ సుమారు రూ. 275కి విలువకి సమానం. కానీ ఈ సిగ్గుమాలిన ప్రభుత్వం మాత్రం ప్రతిరోజూ దాదాపు రూ. 1.5 కోట్లు ప్రకటనలకూ, గొప్ప గొప్ప స్వీయ ప్రచారాలకూ ఖర్చు పెట్టడానికే ఇష్టపడుతుంది. 2014 -- 15 నుండి 2024- 25 మధ్యకాలంలో బిజెపి ప్రభుత్వం సొంత ప్రచారానికి 5,987 కోట్ల రూపాయలను ఖర్చు చేసింది అని ఖర్గే ఎత్తిచూపారు. కోట్లాది మంది వృద్ధులు కనీస మందులు, ఆహారానికి కూడా సరిపోని తక్కువ పెన్షన్లతో బతుకుతుండగా, మోడీ ప్రభుత్వం, బిజెపి మాత్రం విపరీతమైన ఎన్నికల ప్రచారాలు, భారీ కాన్వాయ్‌లు, ఘనంగా కార్యక్రమాలు, ఎడతెరిపి లేని ప్రచారంపై విపరీతంగా ఖర్చు చేస్తున్నాయి. ఈ క్రూరమైన బీజేపీ విధానం రాజకీయ ఆర్భాటాలకు విపరీతంగా ఖర్చు చేస్తూ, నిరుపేద పౌరుల ఆర్థిక గౌరవాన్ని హరించివేస్తుంది అని ఆయన అన్నారు.

## పరీక్షల నిర్వహణను రాష్ట్ర
# ప్రభుత్వాలకు తిరిగి అప్పగించాలి



**తిరువనంతపురం మే13 : (నేటి దర్శిని)** ఎన్ టి ఎను రద్దు చేసి, గతంలో మాదిరిగా పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు తిరిగి అప్పగించాలని కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఐ(ఎం)పొలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్ పేర్కొన్నారు. నీట్ -యుజి పరీక్షను రద్దు చేసిన ఎన్ టి ఎను రద్దు చేయాలని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. నీట్- యుజి పరీక్ష చుట్టూ నెలకొన్న వివాదం, ప్రశ్నాపత్రాల లీకేజీలు అత్యంత త్రీవమైనవి, ఖండించదగినవని అన్నారు. కేంద్రం పరీక్షల నిర్వహణ బాధ్యతను ఎన్ టి ఎకు అప్పగించిన తర్వాత ప్రశ్నాపత్రాలు లీక్ కావడం ఇదే మొదటిసారి కాదని అన్నారు. ఈ పరిస్థితి సంవత్సరాల తరబడి కఠోరశ్రమతో పరీక్షకు సిద్ధమయ్యే లక్షలాది మంది విద్యార్థుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు సంవత్సరాల తరబడి కృషి, ఆర్థిక ఇబ్బందులతో పరీక్షల కోసం సిద్ధమవుతారని, కానీ ఇటువంటి అవకతవకలు వారికి సరైన అవకాశాలను దూరం చేస్తున్నాయని మండిపడ్డారు. పరీక్షలను విశ్వసనీయంగా నిర్వహించాల్సిన బాధ్యత గలవారు భద్రతను కల్పించడంలో విఫలమవడం దేశ విద్యావ్యవస్థకు పెద్ద అవమానమని అన్నారు. కోచింగ్ ఇన్ స్టిట్యూట్ మాఫియాల పాత్రపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమగ్రమైన, పారదర్శకమైన, నిర్ణీత కాలంలో విచారణ జరిగేలా చూడాలని పిలుపునిచ్చారు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను పునరుద్ధరించడానికి కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థుల భవిష్యత్తు ప్రయోగాలకు ప్రయోగశాల కాదని, ప్రవేశ పరీక్షల నిర్వహణను అపహాస్య చేస్తూ విద్యార్థుల కలలను నాశనం చేయవద్దని కోరారు.

## నైజిరియాలో వైమానిక దాడులు.. 100 మంది పైగా మృతి



**హైదరాబాద్ మే13 : (నేటి దర్శిని)** నైజీరియా సైన్యం జరిపిన వైమానిక దాడుల్లో 100 మందికి పైగా సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' వెల్లడించింది. జంఫరా రాష్ట్రంలోని తుంఫా మార్కెట్ లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని, దీనిపై తక్షణమే స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనను రెడ్ క్రాస్ ధ్రువీకరించగా, నైజీరియా మిలిటరీ మాత్రం దీనిని ఖండించింది. మృతుల్లో పౌరులు లేరని బుకాయిస్తోంది. ఈ ఘటనలో ఎక్కువగా చిన్న పిల్లలే మృతి చెందారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది.

## కూలిన ప్రైవేట్ శిక్షణా
# విమానం.. పైలెట్ సురక్షితం



**ముంబయి : మే13 : (నేటి దర్శిని)** మహారాష్ట్రలోని పూణె జిల్లా బారామతిలో బుధవారం ఉదయం ఒక ప్రైవేట్ కంపెనీకి చెందిన శిక్షణా విమానం కూలిపోయింది. జనవరిలో ఎన్ సి పి నేత అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం కూలిపోయిన ప్రాంతంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో అజిత్ పవార్ మరణించిన సంగతి తెలిసిందే. బారామతి ఎయిర్ స్ట్రిప్ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గోజుబావి గ్రామ సమీపంలో ఉదయం 8.50గంటలకు ఈ ప్రమాదం జరిగిందని పూణె సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వెల్లడించారు. విమానంలో సాంకేతిక లోపం తలెత్తిందని, ప్రమాద సమయంలో విమానం నేలను తాకడానికి కొద్ది క్షణాల ముందు, దానిలో కొంత భాగం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిందని అన్నారు. ఈ ప్రమాదం నుండి పైలెట్ సురక్షితంగా బయటపడ్డారని అన్నారు. ఈ విమానం రెడ్ బర్డ్ ఫ్లైట్ ట్రైనింగ్ అకాడమీకి చెందినది.

## లెబనాన్‌పై మరోసారి
# ఇజ్రాయిల్ వైమానిక దాడులు

### -చిన్నారితో సహా 13 మంది మృతి




**బీరూట్ మే13 : (నేటి దర్శిని)** కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ, ఇజ్రాయిల్ దక్షిణ లెబనాన్ పై మరోసారి భారీ వైమానిక దాడులు చేపట్టింది. ఈ దాడుల్లో ఒక చిన్నారితో సహా 13 మంది మృతి చెందినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. పలువురు గాయపడినట్లు సమాచారం. మృతుల్లో ఇద్దరు పౌర రక్షణ సిబ్బంది, ఒక సైనికుడు కూడా ఉన్నారు. దక్షిణ లెబనాన్‌లోని హబ్బూష్ గ్రామంపై జరిగిన దాడి అత్యంత తీవ్రంగా మారింది. గ్రామాన్ని వెంటనే ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ సైన్యం హెచ్చరించిన కొద్దిసేపటికే క్షిపణులు గ్రామంపై పడ్డాయి. ఒక నివాస గృహంపై జరిగిన దాడిలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఇక మరో ఘటనలో, గాయపడిన వ్యక్తిని రక్షించేందుకు వెళ్లిన ఇద్దరు వాలంటీర్లు క్షిపణి దాడిలో మరణించారు. నబాటియా ప్రాంతంలో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఓ సిరియా పౌరుడు, అతని కుమార్తె కూడా డ్రోన్ దాడిలో మృతి చెందినట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఏప్రిల్ 17 నుంచి అమల్లోకి వచ్చిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్ తరచుగా దాడులు కొనసాగిస్తోందని లెబనాన్ ఆరోపిస్తోంది. గత కొన్ని రోజులుగా దక్షిణ లెబనాన్‌లోని పలు గ్రామాలపై ఇజ్రాయిల్ వైమానిక దళం, ఫిరంగి దళాలు తీవ్ర దాడులు నిర్వహిస్తున్నాయి. లెబనీస్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, మార్చి నెల నుంచి కొనసాగుతున్న దాడుల్లో ఇప్పటివరకు 2,800 మందికి పైగా మరణించినట్లు సమాచారం.

# గుర్రంపోడులో పశువుల కొట్టం దగ్ధం..

● రూ.1.20 లక్షల ఆస్తి నష్టం





**గుర్రంపోడు, మే 13 (నేటి దర్శిని):** గుర్రంపోడు మండలంలోని చేపూరు గ్రామానికి చెందిన రైతు కుందనపల్లి నారాయణకు చెందిన పశువుల కొట్టం అగ్నికి ఆహుతైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని కొత్తలాపురం శివారులో ఉన్న పశువుల కొట్టానికి మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు బాధితుడు తెలిపారు. ఈ ఘటనలో పశువుల కొట్టం పూర్తిగా కాలిపోయి, అందులో ఉన్న సామగ్రి దగ్ధమై సుమారు రూ.1.20 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై గుర్రంపోడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు జరిగిన నష్టానికి బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధిత రైతు అధికారులను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# గుర్రంపోడులో ఘనంగా బిఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం

● రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: మాజీ మండల అధ్యక్షుడు నాగులవంచ తిరుపతి రావు



**గుర్రంపోడు, మే13 (నేటి దర్శిని):** మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయం ఘనంగా ప్రారంభమైంది. పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి బిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నాగులవంచ తిరుపతి రావు బుధవారం రిబ్బన్ కట్ చేసి ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగులవంచ తిరుపతి రావు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు అండగా ఉండేందుకే ఈ నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మళ్లీ గులాబీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వజ్జ ధనుంజయ, నాయకులు రామగిరి చంద్రశేఖర రావు, సామల బోజ్జయ్య, నాగరాజు నాయక్, షేక్ సిరాజ్, కామల్ల రాములు, సర్పంచ్ సల్వాది నగేష్, నాగేశ్వరరావు, సింగం ప్రవీణ్, మారం గోపాల్ రెడ్డి, కునూరు సైదిరెడ్డి, ఆవుల కృష్ణ, మండలి రాములు, కొండ్రపల్లి గిరి, పోలేపల్లి యాదయ్య, బాణాల రామకృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు మరియు అన్ని గ్రామాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులు పరిశీలించిన కళ్లెం నవజీవన్ రెడ్డి




**హయత్ నగర్, మే13 (నేటి దర్శిని):** హయత్ నగర్ డివిజన్‌లోని ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తవడంతో స్థానిక మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాలనీ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. నాణ్యతతో కూడిన పనులు పూర్తి చేసిన అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలియజేస్తూ, హయత్ నగర్ డివిజన్ అభివృద్ధి కోసం తాము ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు సూర్య నాయక్, కమిటీ సభ్యులు జంగయ్య, శ్రీశైలం, శ్రీను, రాజా, బీజేపీ నాయకులు బాలు, అమల్, సురేష్ రెడ్డి మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.'



# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సమాజ భాగస్వామ్యం కావాలి: ఎంపీ డాక్టర్ కడియం కావ్య


● ప్రభుత్వ బడులు మట్టిలో మాణిక్యాలను తీర్చిదిద్దుతున్నాయి
● ప్రభుత్వ పాఠశాలల నుంచే స్టేట్ ర్యాంకులు వస్తున్నాయి
● బడి సమాజాన్ని.. భవిష్యత్ తరాలను తయారు చేస్తుంది
● విద్యనే చీకటి నుంచి వెలుగులోకి తీసుకువెళ్తుంది
● బాలికల విద్యతోనే కుటుంబం దేశం అభివృద్ధి చెందుతుంది
● స్టేషన్ ఘనపూర్ విద్యారంగంలో ఆదర్శంగా నిలవాలి

**ఉమ్మడి వరంగల్, మే 13(నేటి దర్శిని బ్యూరో):** ప్రభుత్వ పాఠశాలల బలోపేతం సమాజం చేతిలోనే ఉందని ప్రజాప్రతినిధులు గుడిని ఎంత శ్రద్ధగా చూసుకుంటారో, బడిని కూడా అంతే బాధ్యతగా చూసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్. కడియం కావ్య అన్నారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లు విద్యా అవగాహన సదస్సుకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొని మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎన్నో ఉన్నత స్థానాలకు చేరుకున్న వారిలో ప్రస్తుతం సర్పంచులు, కౌన్సిలర్లు కూడా ఉన్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ బడులు మట్టిలో మాణిక్యాలను తీర్చిదిద్దుతున్నాయని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచే స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు కూడా వస్తున్నారని తెలిపారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 550కు పైగా మార్కులు సాధించిన 120 మంది విద్యార్థులను సన్మానించినట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత సమాజంపై ఉందని, ముఖ్యంగా పేద విద్యార్థులను గుర్తించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సర్పంచులు, కౌన్సిలర్లు ముందుండాలని కోరారు. పాఠశాలలకు అవసరమైన వసతులు కల్పించేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రభుత్వ బడులపై తల్లిదండ్రుల్లో మరింత నమ్మకం పెంచి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు. బడి సమాజాన్ని తయారు చేస్తుంది.. భవిష్యత్ తరాలను తీర్చిదిద్దుతుందని ఎంపీ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పిల్లలను సొంత పిల్లల్లా చూసుకుంటూ వారి ప్రతిభను గుర్తించి అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై నిరంతర మానిటరింగ్ నిర్వహించాలని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పినట్లుగా విద్యనే చీకటి నుంచి వెలుగులోకి తీసుకువెళ్తుందని తెలిపారు. బాలికల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇంట్లో ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని, మహిళల విద్యపైనే దేశ ప్రగతి ఆధారపడి ఉంటుందని చెప్పారు. ప్రజాప్రతినిధులు నెలకు ఒకసారి లేదా రెండు నెలలకు ఒకసారి పాఠశాలలను సందర్శించి విద్యార్థులను పలకరించాలని, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కొన్నిచోట్ల పాఠశాల సమయం ముగిసిన తర్వాత స్కూల్ ప్రాంగణాలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మాదకద్రవ్యాలు విద్యార్థులకు అందుబాటులోకి రావడం ఆందోళనకరమని, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండి విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 11 వేల మంది ఉపాధ్యాయులను భర్తీ చేసినట్లు తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని, పాఠశాలలో పేరెంట్స్--టీచర్స్ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, విద్యార్థుల ప్రగతిని సమీక్షించాలని సూచించారు. రానున్న రోజుల్లో స్టేషన్ ఘనపూర్ విద్యారంగంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. సమ్మర్ సీజన్‌లో బాల్య వివాహాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అలాంటి ఘటనలను అడ్డుకుని అవసరమైతే హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వినయ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, నియోజకవర్గ ఎంఈఓ లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెట్టుగూడ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలపై జిహెచ్ఎంసీ చర్యలు

● స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఆకస్మిక తనిఖీలతో వెలుగులోకి అక్రమాలు
● పార్కింగ్ స్థలాల ఆక్రమణ, సెట్‌బ్యాక్‌ల ఉల్లంఘనలపై చర్యలు
● సిబ్బంది నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం
● రాజకీయ అండతోనే అక్రమ నిర్మాణాలా..? అన్న అనుమానాలు
● కేవలం సీజ్‌లే కాదు.. పూర్తి కూల్చివేతలు చేయాలంటూ ప్రజల డిమాండ్







**తార్నాక, మే 13 (నేటి దర్శిని):** హైదరాబాద్ నగరంలో విస్తరిస్తున్న అక్రమ నిర్మాణాలపై జిహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. మెట్టుగూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందం సీతాఫల్‌మండి, లాలాపేట్ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి అనుమతులకు విరుద్ధంగా కొనసాగుతున్న పలు నిర్మాణాలను సీజ్ చేసింది. దీంతో అక్రమ నిర్మాణదారుల్లో కలకలం నెలకొంది. సీతాఫల్‌మండి ప్రాంతంలోని వీరమాచినేని పాఠశాల వెనుక భాగంలో నిబంధనలను ఉల్లంఘిస్తూ భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో అనుమతులకు మించి అంతస్తులు నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ కొనసాగుతున్న నిర్మాణాలపై అధికారులు వెంటనే సీజ్ చర్యలు చేపట్టారు. లాలాపేట్ ప్రాంతంలో కూడా అనుమతులు ఒక విధంగా తీసుకుని నిర్మాణాలు మరో విధంగా కొనసాగించడం, పార్కింగ్ స్థలాలను ఆక్రమించడం, సెట్‌బ్యాక్ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. కొందరు బిల్డర్లు అధికార యంత్రాంగాన్ని సైతం లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ సిటీ ప్లానర్ సాయిబాబా, టీపిబిఓ సత్యవర్ధన్ సాగర్‌తో పాటు టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు. భారీ యంత్రాంగంతో నిర్వహించిన ఈ తనిఖీలు చూసి కొందరు నిర్మాణదారులు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే, అక్రమ నిర్మాణాలు ఇంతకాలంగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ సిబ్బంది, చైన్‌మెన్‌లు, సెక్షన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పరిస్థితి ఈ స్థాయికి చేరిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణాలు ప్రారంభ దశలోనే అడ్డుకోవాల్సిన అధికారులు ఆలస్యంగా స్పందించడం వెనుక కారణాలేమిటన్న చర్చ జరుగుతోంది. కొందరు రాజకీయ అండతోనే అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయా..? లేక అధికారుల నిర్లక్ష్యం కారణమా..? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజలు మాత్రం కేవలం సీజ్ నోటీసులతో సరిపెట్టకుండా పూర్తిస్థాయిలో కూల్చివేతలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల కారణంగా ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ ఇబ్బందులు, డ్రైనేజ్ సమస్యలు పెరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో కూడా అక్రమ నిర్మాణాలపై నిరంతర చర్యలు కొనసాగిస్తామని జిహెచ్ఎంసీ అధికారులు ప్రకటించినప్పటికీ, ఈ చర్యలు కేవలం హెచ్చరికలకే పరిమితమవుతాయా..? లేక నిజంగా కూల్చివేతల వరకు వెళ్తాయా..? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# అక్రమ నిర్మాణాలపై కాప్రా సర్కిల్ ఏసీపీ ఉక్కుపాదం

- ‘నిబంధనలు పాటించండి.. అక్రమ నిర్మాణాలు సహించం” -- ఏసీపీ కృష్ణమూర్తి
- నేటి దర్శిని కథనాలతో కదిలిన అధికార యంత్రాంగం
- అనుమతులకు మించి అంతస్తులు, పార్కింగ్ నిబంధనల ఉల్లంఘనలు
- టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల మండిపాటు
- కాప్రా సర్కిల్ వ్యాప్తంగా సమగ్ర సర్వే చేపట్టాలని డిమాండ్







**కాప్రా, మే 13 (నేటి దర్శిని):** కాప్రా సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికార యంత్రాంగం ఎట్టకేలకు కఠిన చర్యలకు దిగింది. చర్లపల్లి డివిజన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న సుమారు నాలుగు భవనాలను కాప్రా సర్కిల్ ఏసీపీ కృష్ణమూర్తి సీజ్ చేయించారు. అక్రమ నిర్మాణాలపై పలు పత్రికల్లో, ముఖ్యంగా నేటి దర్శిని దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమవడంతో అధికారులు స్పందించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవల చర్లపల్లి, ఏఎస్‌రావు నగర్, మల్లాపూర్, నాచారం తదితర ప్రాంతాల్లో అనుమతులకు మించి అదనపు అంతస్తులు నిర్మించడం, సెల్లార్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం, పార్కింగ్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి అక్రమాలు బహిరంగంగానే కొనసాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటివరకు సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. “ఎవరి మాటలు నమ్మి అక్రమ నిర్మాణాలకు డబ్బులు ఖర్చు చేయొద్దు. చట్టప్రకారం అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలి. అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు” అని ఏసీపీ కృష్ణమూర్తి హెచ్చరించినట్లు సమాచారం. నిర్మాణాలు ప్రారంభ దశలోనే అడ్డుకోవాల్సిన అధికారులు ఫిర్యాదులు వచ్చిన తర్వాత మాత్రమే స్పందించడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నేటి దర్శిని లో కథనాలు వెలువడిన వెంటనే అధికారులు రంగంలోకి దిగడం ప్రజా ఒత్తిడి కారణంగానే జరిగిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

అయితే నాలుగు భవనాలను సీజ్ చేయడం మాత్రమే సరిపోదని, కాప్రా సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న అన్ని అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో భారీ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, దీనికి కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అక్రమ కట్టడాల వెనుక ఉన్న బిల్డర్లకు టౌన్ ప్లానింగ్ విభాగంలోని కొంతమంది సెక్షన్ అధికారులు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు పూర్తి స్థాయి విచారణ జరిపి అక్రమ నిర్మాణాల మాఫియాపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.




# గుర్రంపూడ్ మండలంలో ఉచిత టైక్వాండో వేసవి శిక్షణ శిబిరం





**గుర్రంపోడు, మే13 (నేటి దర్శిని):** నల్గొండ జిల్లా గుర్రంపూడ్ మండలం మోసంగి గ్రామంలో విద్యార్థులకు ఉచిత టైక్వాండో వేసవి ప్రత్యేక శిక్షణ శిబిరం (సమ్మర్ స్పెషల్ ఉచిత క్యాంపు) ఘనంగా ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు, వారి శారీరక, మానసిక దృఢత్వానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామ సర్పంచ్ పిల్లి ఉమారాణి అభినయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఉచిత శిక్షణా శిబిరాన్ని టైక్వాండో జిల్లా జనరల్ సెక్రెటరీ అనిల్ కుమార్, సర్పంచ్ పిల్లి ఉమారాణి అభినయ్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఇలాంటి క్రీడల్లో రాణించాలన్నారు. ముఖ్యంగా బాలికలకు ఆత్మరక్షణ విద్య ఎంతగానోఉపయోగపడుతుందని, గ్రామీణ ప్రాంత పిల్లల కోసం ఉచితంగా ఈ క్యాంపును ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కోట్ల శ్రీనాథ్, వార్డు సభ్యులు నిరసన మెట్ల లవ కుమార్, మాదాసు శ్రీకాంత్, నిరసన మెట్ల సందీప్, బడుగుల శ్రీనివాస్, నిరసనమట్ల బాలయ్య, కాంచని చంటి, గోవు నాగరాజు, నిరసన మెట్ల సంతోష్, నడ్డి మల్లేష్, మర్రి నాగరాజు, పిల్లి నాగరాజు పాల్గొన్నారు. వీరితో పాటు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు విచ్చేసిన టైక్వాండో కోచ్ మనోజ్, సీనియర్ ప్లేయర్ పూర్ణ చందు, మరియు మర్రి మైసయ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో ఉచితంగా క్రీడా శిక్షణ అందిస్తున్నందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సర్పంచ్ పిల్లి ఉమారాణి అభినయ్ బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.


## శ్వేతా గార్డెన్స్ ఎదురుగా నూతన సీసీ రోడ్డు నిర్మాణం

- రూ.35 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పూర్తి..
- హర్షం వ్యక్తం చేసిన స్థానికులు



**కొత్తపేట, మే13 (నేటి దర్శిని):** కొత్తపేట డివిజన్ పరిధిలోని మారుతీ నగర్‌లో శ్వేతా గార్డెన్స్ ఎదురుగా రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కాలనీవాసుల ఆహ్వానం మేరకు మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ రోడ్డును పరిశీలించారు. ఎన్నో సంవత్సరాలుగా రోడ్డు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ సీసీ రోడ్డు నిర్మాణం ఎంతో ఉపయుక్తంగా మారిందని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో బురద, నీటి నిల్వల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, కాలనీ సభ్యులు మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్‌ను సాదరంగా ఆహ్వానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వారోత్సవాలపై కలెక్టరేట్‌లో సమీక్ష



**ఎలిగేడు, మే 13 (నేటి దర్శిని):** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు, ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎలిగేడు మండలానికి చెందిన సర్పంచులు, విద్యాశాఖ అధికారులు హాజరయ్యారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతుల సమస్యలు, అభివృద్ధి పనులు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై జిల్లా కలెక్టర్ కోయ హర్ష, జిల్లా విద్యాధికారి శారద దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నరేంద్ర చారి, సర్పంచులు కప్పల ప్రవీణ్, మారం కొమురయ్య, కవ్వంపెల్లి బాపయ్య, సిద్ధి తిరుపతి, పల్లెర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీభక్తాంజనేయస్వామి దివ్య ప్రతిష్ట

**ఎలిగేడు, మే 13 (నేటి దర్శిని):** ముప్పిరితోట గ్రామంలోని నూతన ఆలయంలో శ్రీభక్తాంజనేయస్వామి దివ్య పునఃప్రతిష్టాపన మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. తోగుట--రంగంపేట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతిస్వామి ఆచార్యత్వంలో అశేష భక్తజనసందోహం మధ్యన ప్రత్యేక పూజా కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి. ఉదయం ఆవాహిత దేవతా, గర్తన్యాసం, యంత్ర ప్రతిష్ట, ధ్వజ, మూర్తి ప్రతిష్ట, బలిహరణం, పూర్ణాహుతి, కలశోద్వాసన, అవబృథం, రుత్విక్ సన్మానం,



మహాదాశీర్వచనం వంటి విశిష్ట కర్మలు నిర్వహించగా అనంతరం అన్నప్రసాదం భక్తులకు అందించారు. ఈ మహోత్సవంలో తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుగ్యాల సంతోష్ రావు, కాంగ్రెస్ నాయకులు రామిడి వెంకట్రాంరెడ్డి, దేవరాజు, కోట లాలయ్య తదితరులు పాల్గొన్నారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, ట్రినిటీ విద్యాసంస్థల అధినేత దాసరి మనోహర్ రెడ్డి కూడా స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ తానుపర్తి స్రవంతి మోహన్ రావు, మాజీ ఉపసర్పంచ్ చీకట్ల సంతోష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్ జన్మదిన వేడుకలు



**వనస్థలిపురం, మే13 (నేటి దర్శిని):** ఎల్బీనగర్ నియోజకవర్గ బిజెపి కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్ జన్మదిన వేడుకలను వనస్థలిపురంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల సందర్భంగా నివాసం వద్ద పండుగ వాతావరణం నెలకొంది. బిజెపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కొత్త రవీందర్ గౌడ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి, వనపల్లి శ్రీనివాసరెడ్డి, కళ్లెం శంకర్ రెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ కొత్త రవీందర్ గౌడ్ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. యువతను పార్టీ వైపు ఆకర్షిస్తూ బిజెపి బలోపేతానికి విశేషంగా పనిచేస్తున్నారని కొనియాడారు. అనంతరం కొత్త రవీందర్ గౌడ్ మాట్లాడుతూ తన జన్మదినాన్ని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మరింత కృషి చేస్తానని చెప్పారు. ప్రజాసేవే తన లక్ష్యమని పేర్కొన్నారు. జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అభిమానులు నినాదాలతో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బోడుప్పల్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక




**బోడుప్పల్, మే 13 (నేటి దర్శిని):** రాజీవ్ నగర్ కాలనీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం తడి చెత్త--పొడి చెత్త అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సానిటరీ అధికారి డీ. ఈ. జాహ్నవి మాట్లాడుతూ, "చెత్త ఆటోలు వచ్చినప్పుడు గ్రీన్ బాకెట్‌లో తడి చెత్త, బ్లూ బాకెట్‌లో పొడి చెత్త, రెడ్ బాకెట్‌లో డ్రైపర్లు--పాడ్స్, బ్లాక్ బాకెట్‌లో సిరంజీలు, గ్లాస్ ముక్కలు, డేట్ అయిపోయిన మందులు వేయాలి. పరిసరాలు శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపడుతున్నామని, రోడ్డు పక్కన చెత్త వేసే వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సానిటరీ వార్డు ఆఫీసర్ జాడిగే శ్రీను, హెల్త్ అసిస్టెంట్ వినోద్, డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు, సానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

## నీట్ లీకేజీ బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్




**మక్తల్ మే 13, (నేటి దర్శిని):** దేశవ్యాప్తంగా కోట్లాది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీ ట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యులైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని కుతుబ్ డిమాండ్ చేశారు బుధవారం అమరచింతలో ఆయన మాట్లాడుతూ రాజస్థాన్లోని ప్రింటింగ్ ప్రెస్ నుండి పేపర్ లీకేజీ కావడం చూస్తుంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యార్థుల పట్ల ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అర్థమవుతుందన్నారు లీకేజీ వల్ల పరీక్ష రద్దు కావడంతో లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపించారు కేంద్ర ప్రభుత్వం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ( ఎన్ టి ఏ ) విద్యార్థుల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని విమర్శించారు పేద మధ్యతరగతి కి చెందిన విద్యార్థులు వాక్యంలో కష్టపడి పరీక్షలు రాస్తుంటే కొందరు మాత్రం లీకేజీ చేసి వందకు వంద మార్కులు కొట్టేయడం ఏమిటని ప్రశ్నించారు పరీక్ష రద్దవడంతో పేద విద్యార్థులు మళ్లీ కోచింగ్ సెంటర్లకు వెళ్లి డబ్బులు ఖర్చు పెట్టాలని ఇది విద్యార్థుల కుటుంబాలకు వారి తల్లిదండ్రులకు సాధ్యం కానీ పని అని అన్నారు విద్యార్థుల భవిష్యత్తు చెలగాటమాడుతున్న పాలకుల వైఖరిని (ఏఐవైఎఫ్) తీవ్రంగా ఖండిస్తోందన్నారు పరీక్షలను అవినీతి కేంద్రాలుగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా పరీక్షలను అవినీతి కేంద్రాలుగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి యువజన ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అనురాగ్ విజయ్ చేతన్ నవదీప్ పాల్గొన్నారు

# ప్రతి ఇంటి సమాచారం దేశ అభివృద్ధికి బాట: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్

- జనాభా గణనలో భాగస్వామ్యం...అభివృద్ధిలో ముందడుగు
- ఉజ్వల భవిష్యత్తు కోసం... మనమంతా కలిసి ముందుకు సాగుదాం
- జనాభా గణనలో ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా పాల్గొనాలి
- సమగ్ర సమాచారం ద్వారానే ప్రజలకు మెరుగైన సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందుతాయి
- జనాభా గణన దేశ భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది జిల్లా కలెక్టర్ చాహత్ వాజ్ పాయి , ఎమ్మెల్యే నాగరాజు




**ఉమ్మడి వరంగల్, మే 13(నేటి దర్శిని బ్యూరో):** ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు కావాలంటే జనాభా గణన అత్యంత కీలకమని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు పేర్కొన్నారు. హన్మకొండ నగరంలోని కాకతీయ యూనివర్సిటీ క్రాస్ రోడ్డు సర్కిల్ నుంచి భీమారం సర్కిల్ వరకు నిర్వహించిన జనాభా గణన అవగాహన ర్యాలీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి , ఎమ్మెల్యే నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూజనాభా గణన అనేది కేవలం లెక్కలు సేకరించే ప్రక్రియ మాత్రమే కాకుండా దేశ భవిష్యత్ అభివృద్ధికి దిశానిర్దేశం చేసే మహత్తర కార్యక్రమమని అన్నారు. దేశంలోని ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి గురించి సమగ్ర సమాచారం సేకరించడం ద్వారా ప్రభుత్వాలు ప్రజల అవసరాలను అంచనా వేసి సరైన విధానాలు రూపొందించగలుగుతాయని తెలిపారు. ప్రత్యేకంగా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, రోడ్లు, తాగునీరు, గృహ నిర్మాణం, ఉపాధి అవకాశాలు, మహిళా మరియు బాలల సంక్షేమం వంటి రంగాల్లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు జనాభాగణన ద్వారా లభించే సమాచారం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు జనాభా గణన సిబ్బందికి పూర్తి సహకారం అందించి ఖచ్చితమైన వివరాలు ఇవ్వాలని కోరారు. సరైన సమాచారం అందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజల సహకారంతోనే ప్రభుత్వ అభివృద్ధి ప్రణాళికలు విజయవంతమవుతాయని తెలిపారు. అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని, అందులో జనాభా గణన ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. ఈ అవగాహన ర్యాలీలో జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, యువత, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని జనాభా గణనపై అవగాహన కల్పించారు.

# వృద్ధాశ్రమంలో ఘనంగా రుచి అగర్వాల్, నెహెత్ పచ్చం పుట్టినరోజు వేడుకలు



- వృద్ధుల ఆశీర్వాదాల మధ్య అల్పాహార, భోజన కార్యక్రమాలు
- సేవలోనే అసలైన ఆనందం.. కృష్ణ గోపాల్ సేవా సమితి





**హైదరాబాద్, మే 13 (నేటి దర్శిని):** రుచి అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం వృద్ధాశ్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా చిన్నారి నెహెత్ పచ్చం పుట్టినరోజు సందర్భంగా మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వృద్ధులకు ఆతిథ్యం అందించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలోని పెద్దలు వారిద్దరికీ హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు వృద్ధులతో కలిసి ఆనందంగా గడిపారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, సమాజ సేవతో పుట్టినరోజులు జరుపుకోవడం ఎంతో ఆనందాన్నిస్తుందని తెలిపారు. వృద్ధుల ముఖాల్లో కనిపించిన చిరునవ్వే తమ సేవా కార్యక్రమానికి నిజమైన గుర్తింపని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి కార్యదర్శి సచిన్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి మనోజ్ గుప్తా, కోశాధికారి కుష్ అగర్వాల్, ఈసీ సభ్యులు సంజయ్ ధన్వావత్, పాకా సతీష్ యాదవ్, సునీల్ దరాడే తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు

# సేకరించిన ధాన్యం రైస్ మిల్లులలో త్వరితగతిన దింపుకోవాలి కొనుగోళ్ల వేగం పెంచాలి

- -ఎలాంటి కొర్రీలు పెట్టొద్దు.
- -రైస్ మిల్లులు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ జిల్లామే-13 (నేటి దర్శిని):** తిమ్మాపూర్ మండలం రేణిగుంట పరిధిలోగల శ్రీ సాయి శ్రీనివాస,ఆర్.కే రైస్ మిల్లులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. సేకరించిన ధాన్యం రైస్ మిల్లులలో త్వరితగతిన దింపుకోవాలని,తద్వారా కొనుగోళ్ల వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు రవాణా అయిన ధాన్యం అన్ లోడింగ్ విధానాన్ని పరిశీలించారు. సంబంధిత మిల్లులకు కేటాయించిన ధాన్యం, ఇప్పటివరకు ఈ మిల్లులకు చేరిన ధాన్యం తదితర వివరాలను పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రజనీకాంత్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిల్లర్ తో మాట్లాడుతూ దిగుమతి ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. మిల్లుల్లో ధాన్యం త్వరితగతిన దింపుకోవడం ద్వారా మొత్తం కొనుగోలు వేగం పెరుగుతుందని తెలిపారు. మిల్లర్లు, రవాణాదారులు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది సమన్వయంతో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. మరింతమంది హమాలీలను,వాహనాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అన్ లోడింగ్ విషయంలో బిల్లు యజమానులు కొర్రీలు విధించరాదని హెచ్చరించారు. సమస్యలను అధికారులకు తెలియజేయాలని, వెనువెంటనే పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డిఓ మహేశ్వర్,పౌర సరఫరాల సంస్థ డిఎం రజనీకాంత్,తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# వన్స్‌మోర్.. అల్లు అర్జున్‌తో 'బుట్టబొమ్మ' రొమాన్స్..!



టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ ప్రస్తుతం రాకా సినిమాతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఇదిలా ఉంటే మరోవైపు తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చేశాడు. ఏఏ23గా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త మూవీ లవర్స్‌ను ఎక్సయిటింగ్ అయ్యేలా చేస్తోంది. పొడుగు కాళ్ల సుందరి పూజా హెగ్డే ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించనుందట.టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ ప్రస్తుతం రాకా సినిమాతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఇదిలా ఉంటే మరోవైపు తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చేశాడు. ఏఏ23గా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త మూవీ లవర్స్‌ను ఎక్సయిటింగ్ అయ్యేలా చేస్తోంది. పొడుగు కాళ్ల సుందరి పూజా హెగ్డే ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించనుందట.

# సమంత 'మా ఇంటి బంగార ' కొత్త రిలీజ్ డేట్..

## యాంగ్రీ లుక్‌తో అదిరిపోయిన పోస్టర్!


స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మా ఇంటి బంగారం'పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ఫీమేల్ సెంట్రిక్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకురాలు నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తుండటంతో సినీ అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. మొదట ఈ సినిమాను మే 15న విడుదల చేయాలని మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ మూవీ రిలీజ్ వాయిదా పడింది. దీంతో అభిమానులు కొత్త రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. తాజాగా చిత్రబృందం అధికారిక ప్రకటనతో క్లారిటీ ఇచ్చింది.మా ఇంటి బంగారం' చిత్రాన్ని జూన్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సంప్రదాయ పట్టుచీరలో కనిపిస్తున్న సమంత చేతిలో తుపాకీ పట్టుకుని సీరియస్, యాంగ్రీ లుక్‌లో కనిపించడం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. పోస్టర్‌ను చూస్తుంటే సినిమాలో ఆమె పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై మంచి బజ్ ఏర్పడగా.. తాజా పోస్టర్ ఆ హైప్‌ను మరింత పెంచింది. ముఖ్యంగా సమంత గత కొంతకాలంగా విభిన్న కథలను ఎంచుకుంటూ నటిగా కొత్త కోణాలను చూపిస్తోంది. ఈ క్రమంలో 'మా ఇంటి బంగారం' కూడా ఆమె కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు సంతోష్ నారాయణ్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటం మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు సినిమాకు అదనపు బలంగా నిలుస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక సమంతకు గత కొంతకాలంగా సోలో హిట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.



## పుత్తడి బొమ్మలా ముస్తాబైన రాధిక!

# విడాకులకపై నటి మౌనీ రాయ్ చిరాకు

## అవాస్తవ ప్రచారాలు ఆపాలని పోస్ట్



తన భర్త సూరజ్ నంబియార్‌తో విడిపోతున్నట్టుగా వచ్చిన రూమర్లపై నటి మౌనీరాయ్ స్పందించారు. అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించొద్దని విజ్ఞప్తి చేశారు. మౌనీరాయ్, సూరజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో కావడంతో విడిపోతున్నారన్న ప్రచారం జరగ్గా నటి రియాక్ట్ అయ్యారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీరాయ్ కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు, సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. ప్రస్తుతం ఆయన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా అందుబాటులో లేకపోవడం గమనార్హం. అకౌంట్‌ను డిలీట్ చేసినట్టు సమాచారం. 2022 జనవరిలో సూరజ్ నంబియార్– మౌనీరాయ్ వివాహం జరిగింది. 'నాగిని' సీరియల్‌తో ఆకట్టుకున్న మౌనీరాయ్.. 'గోల్డ్', 'బ్రహ్మాస్త్ర' తదితర సినిమాల్లో నటించారు. 'కేజీయఫ్ చాప్టర్ 1' (కన్నడ), 'వేదా' (హిందీ) తదితర చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌తో అలరించారు.



# నా ఫస్ట్ లవ్ అప్పుడే జరిగింది.. అతడు నేనంటే ఇష్టమన్నాడు.. నేను ఓకే చెప్పాను..

## అనుష్క శెట్టి కామెంట్స్..

సినీరంగంలో అగ్ర కథానాయికగా ఓ వెలుగు వెలిగిన హీరోయిన్లలో అనుష్క శెట్టి. పాన్ ఇండియా లెవల్లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. సూపర్ సినిమాతో మొదలైన ఆమె ప్రయాణం.. అరుంధతి మూవీతో ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. బాహుబలి సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న అనుష్క.. గ్లామర్ పాత్రలే కాకుండా లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతోనూ మెప్పించింది. అసలు పేరు స్వీటి శెట్టి. కానీ సినిమాల్లోకి వచ్చాకా దర్శకుడు పూరి జగన్నాథ్, హీరో నాగార్జున కలిసి ఆమెకు అనుష్క అనే పేరును నామకరణం చేశారు. సినిమాల్లోకి రాకముందు అనుష్క యోగా టీచర్ గా పనిచేసింది. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో, అక్కినేని నాగార్జున సరసన నటించిన 'సూపర్' (2005) సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'విక్రమార్కుడు' (2006) సినిమాతో ఈమెకు మంచి బ్రేక్ లభించింది. అలాగే అరుంధతి మూవీతో అనుష్కకు స్టార్ డమ్ వచ్చింది.కోడి రామకృష్ణ దర్శకత్వంలో వచ్చిన ఫాంటసీ చిత్రం 'అరుంధతి' (2009) లో జేజమ్మగా అనుష్క చూపించిన నటన ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. ఈ సినిమాకు గాను ఆమె నంది స్పెషల్ జ్యూరీ అవార్డు, ఫిలింఫేర్ ఉత్తమ నటి అవార్డులను అందుకున్నారు. ఆ తర్వాత 'రుద్రమదేవి', 'భాగమతి' వంటి చిత్రాలు ఆమె స్టార్ ఇమేజ్‌ను మరింత పెంచాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్న అనుష్క.. గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరలవుతున్నాయి.అనుష్క శెట్టి ఒక ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, సహచర నటీనటుల గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఆమెకు ఇష్టమైన హీరోయిన్స్ జాబితాలో త్రిష, నయనతార ఉన్నారని తెలిపారు. భూమికను తన కుటుంబ సభ్యురాలిగా భావిస్తానని పేర్కొన్నారు. హీరోల విషయానికి వస్తే, నాగార్జున అత్యంత పాజిటివ్ వ్యక్తి అని, సుమంత్ తో పని చేయడం చాలా సౌకర్యంగా ఉంటుందని అనుష్క వెల్లడించారు. తన వ్యక్తిగత బలహీనత గురించి ప్రస్తావిస్తూ, తాను ఫోన్‌ను సైలెంట్‌లో పెట్టడం వల్ల తరచుగా అందుబాటులో ఉండనని, ఇది తనపై వచ్చే పెద్ద ఫిర్యాదు అని అంగీకరించారు. తన తొలి ప్రపోజల్ గురించి అడగ్గా, అది పాఠశాలలో ఆరో తరగతిలో ఉండగా జరిగిందని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో క్లాస్‌మేట్ అయిన ఒక అబ్బాయి నువ్వంటే నాకు చాలా ఇష్టం అని చెప్పగా, ఓకే అని బదులిచ్చానని అనుష్క నవ్వుతూ వివరించారు.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365